


చేతివాచీలో చిన్నముల్లు సరీగ్గా మూడంకె మీద వుంది. మారిపోయిన ప్రకాశరావు నిగురించి మనస్సు ఆలోచిస్తూండగానే కాఫీ హోటలు కేసి కాళ్ళు దారితీశాయి. కాఫీ ముగించి బయటకు అడుగు వేసేటప్పటికి గిరజాలు విర జిమ్ముకుని రవివర్మ ఎదురుగా రావడం కనిపించింది. ఆమనిషిని అక్కడ అప్పట్లో చూస్తానని అనుకోని మూలాన ఆశ్చర్య పడ్డాను. బంగారంవంటి మాగాణీ వుంది అతనికి. అతనితో నాకున్న కొద్దిపరిచయం ప్రకాశరావు మూలంగా ఏర్పడిందే. ఈ విషయాలన్నీ నెమరు వేసుకునేంతలో అతనే వచ్చి పటంలో మాదిరిగా నిలబడ్డాడు. ఎప్పుడొచ్చావు, ఎందుకొచ్చావు యిత్యాది కుశలప్రశ్నలేవో అడగబోతూవుండగానే, అతనే అందుకుని, నీతో చాలావిషయాలు చెప్పాలి, యిప్పుడు టైములేదు నీఎడ్రసు తెలుసుగా, అక్కడకొచ్చి అన్ని విషయాలూ మాట్లాడుతాను, యిప్పుడింక వదిలెయ్యి అని ఏకధారగా అనేసి చరచరా ముందుకువెళ్ళిపోయాడు. అదో కాకతాళీయం.

నిజానికి అతనితో అధికంగా మాట్లాడడానికి నాదగ్గర విషయాలులేవు. కాని పల్లెపట్టుల్నించి యీ పట్నానికి రావాలని, మాగాణీసేద్యం మానుకున్నాడా? అన్న ఒక్కప్రశ్నే నా మనస్సులో మిగిలిపోయింది.

ఒక్కసారి కనురెప్ప మళ్ళా తెరిచాను. మారిపోయిన ప్రకాశరావు మనస్సులో పర్యటన చేస్తున్నాడు. మనస్సులో ప్రకాశరావూ ప్రకాశరావు మీదకు మనస్సూ. ఆగకుండా పరివర్తన చెందే సామగ్రి. కట్టిపెంచలేని ఏకైక వస్తువు మనస్సు. దానికి స్వతస్సిద్ధంగా పరిగెట్టే గుణం వుంది. అల్లాగే వెళ్ళింది ప్రకాశరావు మీదకు ఊరికే కాదు, దూసుకు, దూసుకు.

కనురెప్ప మూసుకు తెరుచుకునే సంధిలో ప్రకాశరావు సంపూర్తిగా మారిపోయాడు.

ఆనవాలుకట్టలేనంతగా...ఏమో ఏం దెబ్బతిన్నాడో. మొత్తంమీద మారిపోయాడు.

ఈ పట్నంలో మేం ఒక జట్టుగా జీవిస్తున్నాము. ఎప్పుడూ నవ్వుతూ, అందంగా, ఆనందంగా కనిపించే మనిషి ముడుచుకుపోయి పేల

చింతా శ్రీరామచంద్రమూర్తి

వంగా అయిపోయాడంటే అందరమూ తలో విధంగా అనుకున్నాము. ఎవరేమి అనుకున్నా, అతని స్థితికి గల కారణము, ఒక్కరికీ అవగాహన కాలేదు. సాహసించి, మాలో కుటుంబరావనే పరిచయస్తుడు అతని యీ విచారం కారణం ఏమిటని అడిగాడు. నిరాశతోటి కూడుకున్న వేదాంతం లాంటి రెండు ముక్కలు వల్లించాడు.

అతను మాట్లాడిన యీ వేదాంత విషయాలపై మేమంతా యిరవై నాలుగు గంటల్నుంచి చర్చలు జరిపాము. ఇంతలో యింత వైరాగ్యం ఓ మనిషిలో ఎల్లా వస్తుంది? ఏ వైరాగ్యమైనా, ఏ వేదాంతమైనా మానసిక పరివర్తనకే ప్రతిఫలం. ప్రకాశరావులో వచ్చిన యీ ప్రతిష్టంభననీ, యీ జీవిత పరివర్తననీ, చైతన్యప్రవాహాన్నీ ఆపడానికి మేం తప్ప అతనికి 'నా' అనే వాళ్లెవరూ లేరిక్కడ. గుప్పెడు మెతుకులకోసం గుమాస్తా గిరీ నిర్వహించేందుకై నాలుగు వందల మైళ్ళ దూరంలో వున్న యీ మద్రాసు చేరుకున్నాడు. విజ్ఞాన ప్రభావం వల్ల మైళ్లు దగ్గరయినా మానవునికి మమత సన్నిహితం గాలేదు. అంచేతనో లేక మరే కారణం చేతనో ప్రకాశరావు మారిపోయాడు.

శరీర పోషణలో తగినంత జాగ్రత్త తీసుకునే మనిషి అతను. ఈ విషయాన్ని గుర్తించాకనే అనుకున్నాను. మనస్సే రోగగ్రస్తంగా వుందని. ఈ మానవాస్థిపంజరాన్ని పరిపాలించేది మనస్సు. అది తలచుకుంటా వ్యక్తంగానో, అవ్యక్తంగానో యుద్ధాలు తప్పవు.

* * *

కళ్లుమూసి తెరుచుకునేంతలో మారిపోయిన ప్రకాశరావే నా ఎదురుగా వస్తున్నాడు. వాచీలో ముల్లు యింకొక గంట మీదకు జరిగాయి. వస్తూన్న మనిషిని చటుక్కున ఆపు చేశాను. అతను నా కళ్లల్లోకి చూశాడు. నేనూ చూశాను, అతని కళ్ళల్లోకి. మానవ శరీరాన్ని అద్దం ఎంత చక్కగా ప్రతిబింబింప చేస్తుందో మనస్సుని కళ్లు అంతకంటే ఎక్కువ విమర్శతో ప్రతిబింబింప చేస్తాయి. చూపులతో చైతన్యాన్ని విరజిమ్మినా, అతని నోటంట ఒక్క పలుకు లేదు. ఊరుకోలేక నేనే అడిగాను అతన్ని; ఎక్కడికి వెడుతున్నాడో అని. ఆగి నిట్టూర్చి, ఎక్కడికైతేలే అని బరువుగా సమాధాన మిచ్చాడు. ఊతగా ఒక్క అడుగు అతనితో వేసి, 'ఎక్కడికో చెప్పవూ?' అని మరొక్కసారి ప్రశ్నించాను. కూలిపోయిన చెట్టుకొమ్మ అడుగునుంచి పైకిలేచే ఉత్సాహంతో గిజగిజా తన్నుకునే గోరువంకలా అయిపోయాడతను. కట్టతెగిన ప్రవాహంలాగ, పట్టలేక పట్టలేక 'నరకంలోకి వెడుతున్నాను. నువ్వూ వస్తావా' అన్నాడు అతను.

ఊహాతో యిచ్చిన సమాధానంకాని, సరియైంది కాదు. మానసికంగా పతనం కావడం మూలంగా యింత అసమర్థంగా మాట్లాడాడని సరిపుచ్చుకున్నాను. అయితే నిశ్శబ్దంగా ఎంతసేపు నడవను? "సరే ఆ నరకంలోకే తీసుకు వెడతావా" అన్నాను గంభీరంగా. ఈ నా సమాధానానికి అతను విరగబడి నవ్వి "రా కూడా. అక్కడ మనలాంటి వాళ్లకెన్నో కాళీలున్నాయన్నా"డతను.

ఇద్దరమూ ఒకరివైపు యింకొకరు చూడకుండా నిశ్శబ్దంగా కొంతదూరం నడిచాము. నడుస్తూన్నంతసేపూ, అతను ఏదో విచ్చగా, భావోద్రేకంతో పొంగలువస్తూన్నట్టు కనపడ్డాడు. నే నాగలేక మళ్లా అడిగాను. ఇప్పుడు నీ కాళ్లు ఎక్కడకు తీసుకువెడుతున్నాయని. నరకంలోకి అని అతను మళ్ళీ సమాధానం యిచ్చాడు. అయితే నువ్వెప్పుడైనా చూశావా దాన్ని అని యింకో ప్రశ్న. లక్షా తొంభైసార్లు వెళ్లానన్నాడు. ఇంతకు పూర్వం నరకద్వారాన్ని మాత్రము చూశాననీ, యిప్పుడు గర్భాలయంలో కింకర సందర్శనమైందని అంటూ ఫక్కున నవ్వాడు. ఆ నవ్వులో వ్యంగ్యంగా పగిలిపోయే ప్రపంచాలు కనపడ్డాయి. నేను అసలు విషయం ఏమిటో తెలుసుకోగలనని ఆశలో పడ్డాను.

గడియారం తిరుగుతోంది. మేం సముద్రం వైపు వెళ్లేం. నీటిమీంచివచ్చే చల్లటి గాలీ, వెచ్చగా ఎండా రెండూ చాలా ఆకర్షణీయమైనవింత ప్రకృతిని కూరుస్తున్నాయి. కాని యీ ప్రకృతి ప్రకాశరావు శరీరానికీ, మనస్సుకీ ఏ బేధమూ కల్పించలేకపోయింది. ఇప్పుడు అతను మాట్లా

డిన ఆప్తై మాటలకే, పూర్వంవాటికే, ధోరణిలో ఉద్రేకంలో చాలా తేడావుంది. ఇక్కడకు వచ్చినప్పుడే యీ మదరాసు జీవితాన్ని గురించి మా కందరకూ తలో అభిప్రాయమూ ఏర్పడింది. సామాన్య మానవునికి యిక్కడ నిత్య జీవితం ఎంతో కష్టం. అప్పుడు ప్రకాశరావన్నాడు: పల్లెని వదిలిపెట్టేటప్పుడు అనుకున్నాను, స్వర్గానికి వెడుతున్నానని, కాని కేవలం చూస్తినికదా యిది నరకంకంటే అధమాధమం.

నిజానికి ప్రభుత్వం కృషి చేస్తున్నా, ప్రజలకి యిక్కడ యిళ్లు దొరకవు. మధ్యవర్తులు యిళ్లకు పగ్రీలు వసూలుచేసి పకోడీల్లా తినివేస్తారు. అథవా ఒక గది దొరికితే, ఏ నల్లుల్లాగో, బల్లుల్లాగో గోడలకి గొండెలకీ అంకితమై పోవడం. హోటళ్లల్లో పెట్టే ఆహారం, జీవితాన్ని క్రమంగా శూన్యంచేసి, పౌరుషాన్నీ, బలాన్నీ హారతి కర్పూరంలా హరించివేసేటంత యోగ్యమైంది. ఇంక నీటికి పడేయిబ్బంది చెప్పనే అక్కర్లేదు. మొత్తం యీపట్నపుజీవితాన్ని ఒక్కముక్కలో చెప్పాలీ అంటే, కాలమూ, అలవాట్లూ మానవున్ని నడుపుతాయిగాని, మానవుడు అలవాట్లని నడపలేదు. ఇక్కడ మానవుడు కాలరాక్షసికి బానిసఅయి కాగడా వేస్తాడు.

ఈ బాధలన్నీ ఆకళించుకున్నావనే ప్రకాశరావూ తదితర పరిచితులమూ ఒక నిర్ణయానికి వచ్చి ఎట్లాగో బ్రతికేస్తున్నాము. ఈ ప్రభుత్వం డిసెంట్రిలయిజేషన్ అమలు జగిపిస్తే యిక్కడ యింత నరకబాధ వుండదు. నాలో యీ అనుభూతులన్నీ ఒకదాని వెంబడి ఒకటి పరిగెడుతున్నాయి.

“ఏం రాధా” అన్నాడు ప్రకాశరావు. ఆ మాటలకి ఉలిక్కిపడ్డాను నేను. ఇంతసేపూ, యితరత్రా వేడిగా, ఆవేదనతో వున్న నాకు అతని పలుకు మంచిగంధపు పూతలా తోచింది. మనిషిలో వేడి తగ్గిందని తెలుసుకున్నాను. ఇప్పుడెక్కడికి వెడుతున్నామో చెప్పు అన్నాను.

కళ్లు రెండూ మిటకరించి “సముద్రంకేసి” అన్నాడు అతను.

“అయితే తెలివి వచ్చిందన్నమాట” అన్నాను నేను.

“తెలివి! ఏం, అల్లా అంటూన్నావు”

“నరకంలోకి అన్నావుకదూ యిందాక” తిరిగి ప్రశ్నించాను నేను.

“నరకం కాకపోతే స్వర్గంకామోసు యిది” సమర్థించుకున్నాడతను.

“ఎల్లాగయినా వారం రోజులనించి మారిపోయావు” అన్నాను నేను.

“మతిలేని మనిషినా మారకపోవడానికి?” అంటూ నూనె రాయని తన జుట్టులోకి పోనిచ్చాడు వేళ్లను రెంటినీ.

ఈ ప్రశ్నోత్తరాల వర్షం ఆగింది కొంచెం సేపు. జీవితంలో ఏ విషయమైతే అతనికి బాధని కల్పించిందో, దానికి ఉపశమన మార్గాలు వెతుకుతున్నాడు. చీకటిరోజుల్నించి చంద్రుడు వెన్నెలలోకి ప్రయాణం సాగించినట్టు. అతను ప్రశ్నించకుండా ఊరుకోలేక పోయాడు. బ్రతకడం దేనికని అతడి ప్రశ్న.

“భాగ్యం వున్నవాడు అనుభవించడానికి, లేనివాడు బాధపడడానికే” అన్నాను నేను. ఇంకా నా మాటలు పూర్తికానేలేదు. ఒక్కసారి అమాంతం లేచి కౌగలించుకున్నాడు. అతని కళ్లల్లో నీళ్లు ఆసంధ్య వెలుతురులో తళుక్కున మెరిశాయి. అతని హృదయమనే సూదంటురాయికి సత్యమనే యినుపముక్క టక్కుని అతుక్కుంది.

ఇంక నే నాగలేదు. ప్రశ్న అడగడానికి యింకా నాదే పైచెయ్యి అయింది. నీ యీ స్థితికిగల కారణం చెప్పావు కాదన్నాను. ఉపోద్ఘాతము నాది. ఉపక్రమణ అతనిదని.

నాభార్య చాలా అందమైందని నీతో యిదివరలో చెప్పాను జ్ఞాపకముందా అన్నాడు ప్రకాశరావు; వుందన్నాను నేను. ఏ స్త్రీ నాలో కలిసిమెలిసి అనురాగంతో మసలిందో, ఏ స్త్రీ నా స్వప్నాల్ని యథార్థాలుగా మార్చిందో, ఆ స్త్రీ హృదయంనించి శోకం వర్షమై ధారగా కురిసిందన్నాడతను. ఆమె ముఖపద్మం ముడుచుకు పోయిందన్నాడు.

అతను జేబులోకి చెయ్యి పోనిచ్చాడు. ఇది చదువు అని ఓ ఉత్తరాన్ని నా చేతి కందిచ్చాడు. ప్రారంభించాను. అక్షరాలు వేగంగా దారిని పోయాయి. అది అతని భార్య రాసిన ఉత్తరం.

"మీకు నమస్కరిస్తూ. మీ దయవల్ల చంటాడూ నేనూ కులాసాగా వున్నాము. ఇది వరకు ఎన్నోసార్లు మీరు నన్ను వదలి వెళ్లారు. నేనొక్కర్తెనూ వుండ గలిగేదాన్ని. కాని యీ రెండోసారి ఏమిటోగాని, నరాలన్నీ పాడయ్యాయో ఏమో, నిముష నిముషానికీ ఏడుపొస్తూంది. ఎవర్ని చూసినా భయం. మీరు లేక పోతే ఉత్సాహం తగ్గిం దనుకోవచ్చు. అల్లా కాదు ఇంతగానా?

మొన్న బామ్మావాళ్ళూ వచ్చారు, చిన బాబయ్యగారింటి దగ్గర్నించి. మంగళసూత్రాల సాక్షిగా నా కల్లాంటి అభిప్రాయంలేదు. మీ ప్రేమని సంపూర్ణంగా ఎరుగుదును. బుగ్గల్లో వేళ్లెట్టుకుని అంటుంది బామ్మ. అక్కడ ఆడాళ్లో మరీ విచ్చలవిడిగా తిరుగుతారుట. ఎర్రగా బుర్రగా వున్నదాన్ని దేన్నో అక్కడ మరిగి వుంటాడంది. లేకపోతే ఉద్యోగం అయి సంవత్సరం పైగా అయినా, కాపరం ప్రయత్నం చెయ్యరేమని అడిగింది. అల్లా అపవాదు వెయ్యకంతోటే, ఆడదాన్ని అవడంవల్ల నేమో - కళ్ళంట నీళ్ళు తిరిగాయి అవిచూసి అమ్మ అంది: శుక్రవారంపూటా తెగలిని ఏడుపెందుకే నీకని. పొయ్యాకాలం మరీ వచ్చిందని దుమ్మెత్తి పోసింది. నిజంగా కనీ, పెంచీ పెద్దవాళ్లని చేసినవాళ్లు వాళ్లే అయినా, ఆడదంటేనే అంత. అమ్మలో కరుకుతనం జాస్తి, మగ పిల్లంటే శ్రద్ధ వుంచుకోమనీ, ఆడది కాపురానికెళ్లి యింకో కుటుంబంలో పడిపోతుందనీ తెగ బోధించాడు నాన్న. అదే దాని నరాల్లో యిమిడిపోయింది.

అమ్మ అల్లా అనగానే కళ్ళు తుడిచేసుకున్నాను. అవును మరి. అది వాళ్లిల్లు. ఎల్లా అంటే అల్లాగే కాని ఎదిరించడానికి నాకు హక్కేముంది? కాని కళ్ళ నీళ్ళకు శుక్రవారం శంక వుందంటారా?

నే నూరుకున్నాను, గాని చంటాడు అటు చూసి, యిటు చూసి, వెనకనించి వచ్చి రెండు చేతుల్తోనే తుడిచాడు కన్నీళ్లు అమ్మా ఎందుకే ఏడుపు నాన్నకోసంటే అంటాడు. నేనే కనక నిజం వొప్పుకుంటే, అప్పుడే బయలు దేరతాడు మీ మద్రాసు.

మీరు అంతదూరంలో మా యిద్దరికోసమూ బాధ పడరని నే ననడం లేదు. కాని యిల్లు దొరకదనీ, డబ్బు చాలదనీ అన్నారు గద.

ఇంక యీ జీవితంలో యింత గట్టిగా దెబ్బలు తగుల్తుంటే ఓర్చుకోలేక పోతున్నాను. పోనీ అమ్మమాట ఎల్లాగో భరిద్దామనుకుంటే, నాన్న ఈ ఆడపిల్ల లెందుకు పుట్టారో గాని, అని సణుక్కుంటున్నాడు.

మాయదారి కడుపు, అదీ యీ టైముకే రావాలీ. మీకు పిల్లని తీసుకెళ్ళమని రాశేస్తాడుట. నా మగపిల్లల్ని పాడు చేసుకుంటానా అంటున్నాడు. సరిగ్గా అదే లగ్నానికి బామ్మ అందుకుంది. చిన్నబాబయ్య ఎంత నిలవేసుకున్నాడోట. ఆడపిల్లలు తేరు నాయనా వాడికి, నీకే వచ్చింది. ఒంటేమాత్రం యింత బరువు వేస్తే ఎల్లాగ? కాపురానికి వచ్చిన పిల్లనీ, తల్లినీ నువ్వా ఏమిటి పోషించడం? అంటోంది సాగదీస్తూ.

ఇప్పటికే చాలా పొడుగైంది ఉత్తరం. మీకు వెయ్యవేల నమస్కారాలు. మీ రెన్నిసార్లో చెప్పారు, లలితా, స్వర్గనరకా లెక్కడో లేవు యిక్కడే వున్నాయని. జ్ఞానోదయ సమయం ఆసన్నమైతేనే గాని కళ్లు తెరుచుకోడు మానవుడు. ఇప్పుడే తెలుసుకున్నాను. స్వర్గనరకా లెక్కడో కాదు. ఇక్కడే వున్నాయని.

జీవితంలో యనుసందర్భన మైంది. ఈనరకం నించి వచ్చ్నా పిల్లాణ్ణి తప్పించమని, ప్రభువైన మిమ్మల్ని బ్రతిమాలుతున్నాను. మీతో ఏ కంచని బ్రతకమన్నా సిద్ధం. చంటాడికి జ్వరం తగ్గుతోంది. వాడికోసం బెంగెట్టుకుని మనస్సు పాడు చేసుకోకండి. మీ రాకకై కన్నులు విప్పి ఎదురు చూస్తూవుంటాను.

ఇట్లు, లలిత.

రాయడం మరచాను. బామ్మ చెప్పింది. బాబయ్యగా రబ్బాయిని ఎరుగుదురు కదూ! సిగరట్టు డబ్బా చేత్తో పట్టుకుని తిరుగుతూ వుంటాడు. గిరజాలూ, కళ్ళజోడూ - రవి. వాడు మదరాసు చేరుకున్నాడుట. జాగ్రత్తగా మాత్రం వుండండి. పెళ్లాంవంక వాడని ఏదడిగినా యిచ్చారు గనక. తిరిగి మీ వస్తువు మీకు రాదు.

లలిత—"

ఉత్తరం ముగిసింది. ఉత్తరం అఖరయ్యే పర్యంతమూ మేమిద్దరమూ అక్కడ వున్నట్టే మరిచిపోయాను నేను. ప్రకాశరావు తల వంచుకునే వున్నాడు. అపజయం పొందిన యుద్ధ వీరునిలా నీరసంగా నవ్వాడు. నాలో రేగిన భావపరంపరకి మరింత బలం చేశాడు. అప్రయత్నంగా ప్రశ్నించాడు నన్ను.

''ఇప్పుడు ప్రపంచం కనిపిస్తోందా'' అన్నాడు.

''కనిపిస్తోంది కాని, గిర్రున తిరుగుతున్నట్టు'' అన్నాను నేను.

''నీ మనస్సెక్కడికి'' అన్నాడు ప్రకాశరావు.

''లలిత దగ్గర కన్నాను'' నేను,

''ఆమె దగ్గరేముంది, నిన్నాకర్షించేది'' అన్నాడతను అధికారిలా.

''అదే! యదార్థమైన సత్యం దగ్గరకి. భూతల నరకానికి'' అన్నాను. ఈ నామాటలు అప్రయత్నంగా వచ్చినవి. ప్రయత్నంగా వచ్చినా, అప్రయత్నంగా వచ్చినా అవి తెల్లని వెన్నెలంత సత్యాలు. అంతేకాదు. సముద్రపులోతంత యధార్థాలు. ప్రకాశరావు కనక ఆనాడు, ఆఉత్తరం కొట్టిన దెబ్బకి మరొకడైతే ఖిన్నుడై, లోకానికి వినమ్రుడై చనిపోయేవాడు.

''ఇప్పుడు తెలిసిందా ? మనసు గల మానవుడెందుకు మారాడో'' అన్నాడు ప్రకాశరావు.

''అవునులే. ఈ ఉత్తరం నీమీద ఎంత పరాక్రమించిందో నాకు తెలుసు. నేనే సగం చచ్చిపోయాను అవమానాన్ని భరించలేక'' అన్నాను.

ప్రకాశరావు లేచాడు.

''రాధా దయవుంచు'' అన్నాడు ప్రకాశరావు.

సంఘుగార్థం ఓంద్రపెడుతోంది. కాలం మానవుని మస్తిష్కాన్ని తినివేస్తోంది. వైజ్ఞానిక విప్లవ బీజాల్ని క్రిములు తినివేసాయి. ఎరువులు వేస్తేనేగాని ఇంతలో మానవునిలో చైతన్యం వచ్చే సూచనలు కనపడవు.

"రాధా" అంటూ అడుగు వేసాడు ప్రకాశరావు.

"ఏం" అన్నాను నేను.

"మరి యింతటితో యీ ప్రకాశరావు కనపించడేమో మీకు. ఎక్కడికి వెడతానో మీకూ తెలుసు, ఇంతగా ప్రేమించి బాధపడే లలితను వదలి కరడుకట్టుకు కూచోలేను. వికాసవంతంగా వుండే మన పల్లెలకు పోతాను. కృషితో నాస్తి దుర్భిక్షం అంటారు పెద్దలు. ఆ పల్లెల్లో నవ్యజీవితానికి జయగీతాలు పాడుతాను. ప్రజా సౌఖ్యంలేని ఎందుకొచ్చిన పట్టణాలు" అన్నాడు ప్రకాశరావు. అతని ఎడంకాలు కుడికాలు కంటె ముందుకు పోయింది.

*　　　*　　　*

మెయిలు కూస్తూ వెళ్ళిపోయింది. అందులో ప్రకాశరావు వున్నాడు. అతన్ని రైలెక్కించి నేనూ యింటివైపు దారితీశాను. సందు మలుపులో వీపుమీద తాకున చప్పుడైంది. ఎవరో కాదు రవివర్మ. నాతో చాలాదూరం పిచ్చాపాటి మాట్లాడుకుంటూ వచ్చాడు. చివరకు నేనడిగాను; అతని రాకకి కారణం చెప్పమని.

"నిజం చెప్పనా" అన్నాడు అతను.

"చెప్పు" అన్నాను నేను.

"ఇంక ఆ పల్లెలు నాకు నచ్చుబాటు అవడం లేదు. ఈ మదరాసు స్వర్గంలా వుంది నాకు. తగినన్ని విలాసాలూ, భోగాలూను. డబ్బువుంటే. ఆ పల్లెల్లో ఏం వూసుపోక !" అంటూ చాలా దూరం చెప్పుకొచ్చాడు. పండుగనాడూ పాతదేనా అని అతని మనోవాంఛ. పుస్తె కట్టినంత మాత్రాన వివాహమైందా అని అతని విమర్శ. కథ సాగుతోంది.

మధ్యలో అడిగాను. ప్రకాశరావుని కలుసుకున్నావా అని ?

"ఇప్పుడు రైల్లో కనిపించాడు. ఏముందీ మాట్లాడ్డానికి. నెనొకందుకు వెళ్ళానులే. మీ వూరు సానిది, ఎరగవూ, గ్యాస్‌లైట్. దాన్ని రైలెక్కించుదామను వెళ్ళాను" అన్నాడు. మళ్ళా కలుస్తానని జంక్షన్‌లో చీలిపోయాడు రవివర్మ.